గతి తప్పిన విద్యార్థి

విద్యార్థులు కొందరు తమ జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. గంజాయి ఊబిలో కూరుకుపోతున్నారు. వారి ఉజ్వల భవితకు వారే పొగ పెట్టుకుంటున్నారు. వాడకం నుంచి విక్రయం వరకు విద్యార్థుల హస్తం కనిపిస్తోంది. ఇప్పుడు ఏకంగా స్మగ్లింగ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. తల్లిదండ్రుల కన్న కలలు నిజం చేస్తారనుకుంటే దారి తప్పుతున్నారు. అక్రమ సంపాదనతో జల్సాలు చేస్తున్నారు. వీరిని చూసి మరి కొందరు విద్యార్థులు ఈ ఊబిలోకి దిగుతున్నారు.

- గంజాయి ఊబిలో బీటెక్ స్టూడెంట్స్
- అక్రమ రవాణాలోకి దిగిన వైనం
- పోలీసుల విచారణలో వెల్లడి

పలమనేరు: విశాఖ నుంచి బెంగళూరుకు గంజాయి తరలింపుదందాలో పలమనేరు పట్టణం కీలకంగా మారుతోంది. బెంగళూరులో గంజాయి సిగరెట్లకు మంచి గిరాకీ ఉంది. గంజాయి మత్తుకు అలవాటు పడిన వారి ఐటీ లేకుండా పిచ్చి పట్టే పరిస్థితిని అక్కడి గంజాయి ముఠా తీసుకొచ్చింది. వారికున్న భారీ నెట్ వర్క్‌తో ఇచ్ఛాపురం నుంచి పలురకాల వాహనాల్లో 25 గంటలపాటు ప్రయాణించి బెంగళూరుకు గంజాయిని రవాణా చేయిస్తున్నారు. దాదాపు 1,264 కిలోమీటర్లు వీరు అత్యంత జాగ్రత్తగా వారి నెట్‌వర్క్ పనిచేస్తూ ఉంటుంది. ఇచ్ఛాపురం నుంచి 16వ నంబరు జాతీయ రహదారి మీదుగా నెల్లూరు, తిరుపతి బైపాస్, చిత్తూరు బైపాస్, పలమనేరు మీదుగా కర్ణాటకలో రాష్ట్రంలోకి అక్రమ రవాణా సాగుతోంది. ఈ మార్గంలో ముఖ్యమైన చెక్‌పోస్టులు, పోలీసుల తనిఖీలున్నప్పటికీ గంజాయి అక్రమ రవాణా సాగుతూనే ఉంది.

గంజాయి మత్తులో చిత్తవుతున్న యువత

మత్తుకు అలవాటు పడిన వారు గంజాయి లేకుంటే బతకలేని స్థితికి చేరుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని తిరుపతి, చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, పీలేరు, కుప్పంలో ఇప్పటికే మత్తుకు బానిసైన వారికి ప్యాకెట్లు అందుతున్నాయంటే ఆయా ప్రాంతాల్లో గంజాయి విక్రయించే ఏజెంట్లు ఇంకా కొనసాగిస్తున్నారు. రూ.వంద నుంచి వెయ్యి వరకు సైజులవారీగా వీటిని ప్యాకెట్లలో పెట్టి ఖాళీ సిగరెట్ ప్యాక్‌లో నింపి అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా గంజాయి కారణంగా ఎంతో భవిష్యత్తున్న యువకుల జీవితాలు సర్వనాశనమవుతున్నాయి. గంజాయి స్మగ్లింగ్, విక్రయాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో మరింత ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై స్థానిక సెబ్ సీఐ సురేష్ రెడ్డిని వివరణ కోరగా ఇప్పటికే స్థానికంగా గంజాయి అక్రమ రవాణాదారులపై కేసులు పెడుతున్నామన్నారు. తాజాగా ఐదుగురు స్టూడెంట్స్ గంజాయిని వైజాగ్ నుంచి బైక్‌పై తెచ్చి ఇక్కడి ఏజెంట్లకు అమ్ముతుండగా దాడులు చేసి పట్టుకున్నామని, వారిచ్చిన సమాచారంతో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


గంజాయి ప్యాకెట్లు


పోలీసులకు పట్టుబడిన గంజాయి పార్శిల్స్ (ఫైల్)

ఇవీ సంఘటనలు

- వారం క్రితం తిరుపతిలో చదువుతున్న పలమనేరు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు బైక్‌పై విశాఖకు వెళ్లి గంజాయి తీసుకుని ఇక్కడకు వచ్చేశారు. ఇక్కడ స్థానిక విద్యార్థులకు ఆ గంజాయి విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని విచారించగా తిరుపతిలోని బీటెక్ విద్యార్థులు గంజాయి వ్యాపారంలో బాగా సంపాదిస్తూ జల్సాలు చేస్తున్నారని, వీరిని చూసి మరి కొందరు స్టూడెంట్స్ ఈ వ్యాపారంలోకి దిగినట్టు తేలింది.
- గతంలో పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదానికి గురైన వాహనంలో భారీగా గంజాయిని స్థానిక పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌ను విచారించగా సరుకు బెంగళూరుకు వెళుతోందని హొసకోట వద్ద దీన్ని తీసుకెళ్లే కొరియర్లున్నారని చెప్పాడు.
- ఇటీవల పలమనేరు పోలీసులు గాంధీనగర్ బస్టాప్ వద్ద ఆటోలో గంజాయిని బెంగళూరుకు తరలించే ముఠాను అరెస్ట్ చేశారు. వీరి చిన్నచిన్న ప్యాకెట్లుగా గంజాయిని సిద్ధం చేసుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు.
- ఏకంగా అంబులెన్స్‌లో తరలిస్తున్న ముఠాను గంగవరం పోలీసులు గతంలో పట్టుకున్నారు. బొలేరో, ట్రాక్టర్ డీకొన్న సంఘటనలో బొలేరోలో గంజాయి ప్యాకెట్లను పలమనేరు పోలీసులు గుర్తించారు. వాహనంలోని సీట్లకింద, బ్యానెట్, ఇంజిన్‌లో కనిపించకుండా తీసుకెళ్తున్న విషయం బట్టబయల్లైంది. మరికొందరు విశాఖ నుంచి బెంగళూరుకు బైక్‌పై గంజాయిని తరలిస్తున్నట్టు ఇప్పటికే సెబ్ అధికారులు పసిగట్టారు.

‘ఎర్ర’దుంగల చోరీ కేసులో నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ

శ్రీరంగరాజపురం: ఎర్రచందనం దుంగల చోరీ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప మంగళవారం తెలిపారు. ఆయన కథనం.. పిళ్లారికుప్పం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు రవినాయుడు అటవీ శాఖ అనుమతితో 37 ఎర్రచందనం దుంగలను తన మామిడితోటలో ఉంచారు. వీటిపై కన్నేసిన గ్రామస్తులు సుదర్శన్, బాలాజీ, వరుణ్, మోహన్‌రాజు, గురవయ్య వాటిని గుట్టుగా దొంగిలించి వెంకటాపురం చెరువులో దాచి ఉంచారు. రహస్య సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో ఈ నెల 5న ఆ దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని అన్నదాన ట్రస్టుకు మంగళవారం ఓ దాత నగదు విరాళం చేశారు. ఏలూరుకు చెందిన బాలకృష్ణ ట్రస్టుకు రూ.1,25,000ను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ అధికారులు వారికి స్వామి దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది వాసు, రవి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు మామిడి రైతులకు అవగాహన

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లిలో నేడు బుధవారం ఉదయం 10 గంటలకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు మండల ఉద్యానశాఖ అధికారి విండ్య అన్నారు. ఈ అవకాశాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించండి


కుష్టు వ్యాధిగ్రస్తులను పరీక్షిస్తున్న జిల్లా లెప్రసీ అధికారి

వెదురుకుప్పం: గ్రామాల్లో ఉన్న కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ రెడ్డెప్ప అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆశా సిబ్బంది, ఏఎన్ఎంలు గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. గ్రామాల్లో నెలకు రెండు సార్లు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అనంతరం కుష్టు వ్యాధిగ్రస్తులను పరిశీలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ సురేఖ, ఈశ్వరమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

నగరి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తామని ట్రాన్స్‌కో పుత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ ఎం.చిన్నరెడ్డెప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు బైపాస్ రోడ్డులోని పీవీజే ఫంక్షన్ హాలులో ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరుగుతుందన్నారు. ఈ అదాలత్‌లో రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక, సాంకేతిక, స్వతంత్ర విభాగాల సభ్యులు పాల్గొంటారన్నారు. విద్యుత్ వినియోగదారులు పరిష్కారం కాని సమస్యలను రాతపూర్వక ఫిర్యాదు చేసి, పరిష్కరించుకోవచ్చన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి


గద్దర్‌కు నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ సంఘ సభ్యులు

నగరి: ప్రజా యుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద అలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ జాతీయ కార్యదర్శి గోవిందస్వామి పాటల ద్వారా గద్దర్ అణగారిన వర్గాల ఉన్నతికి చేసిన పోరాటాలను జ్ఞప్తికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి బాలవర్ధన రాజు, అంబేద్కర్ సంఘ నాయకులు సురేష్ కుమార్, కిరణ్ కుమార్, బాలకృష్ణ, తంగరాజు, సీపీఐ విద్యార్థి నాయకుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం: మండలంలోని రైతులు సాగు చేసిన పంటను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని తహసీల్దార్ అరుణకుమారి, ఏఓ ఢిల్లీప్రసాద్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌కే, ఆర్బీకే వ్యవసాయ సహాయకులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆర్బీకే సిబ్బంది, వీఆర్‌ఓలు కలిసి రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేయాలన్నారు. నమోదు చేసుకుంటేనే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అర్హులు అవుతారని తెలిపారు. ఏఓ ఢిల్లీప్రసాద్ మాట్లాడుతూ సెప్టెంబర్ 15వ తేదీలోగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు, వీఆర్‌ఓ పాల్గొన్నారు.

వేడుకగా చిత్తూరమ్మ ఊరేగింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని పెద్దహరిజనవాడలో వెలసిన శ్రీ చిత్తూరమ్మ దేవస్థానంలో మంగళవారం ఆడి ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేసి సుందరమయంగా అలంకరించారు. అలాగే ఉత్సవ విగ్రహాన్ని పలు రకాల పుష్పాలతో తీర్చిదిద్ది నగర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: ప్రస్తుతం వాతావరణ మార్పులవల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు కలిసి ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా నోడల్ ఆఫీసర్ సుశీల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అందువల్ల గ్రామాల్లో ఆశా వర్కర్లు గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులకు ముందస్తు మందులు పంపిణీ చేయాలని తెలిపారు. వర్షపు నీరు నిల్వలేకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సూపర్‌వైజర్ మురళి, సీహెచ్ఓ జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

నగరి: మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నగరి అర్బన్ రూరల్ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేసే కార్మికుల విస్తృత సమావేశం యూనియన్ అధ్యక్షురాలు జమున కృష్ణవేణి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోదండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజనం పథకంలో ఇరవై సంవత్సరాలుగా మహిళా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి సరైన జీతాలు లేకపోయినా వంట చేసి పిల్లలకు పెడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్న ప్రతి సారి కార్మికులను మార్చాలని కోవడాన్ని తప్పుపట్టారు. స్థానిక చోటామోటా నాయకులు రోజురోజుకు కొన్ని సెంటర్లలో కార్మికులను మార్చాలని అనుకోవడం బాధ్యం కాదన్నారు. కార్మికులను రాజకీయ ఒత్తిళ్ల నుంచి కాపాడాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడుతామన్నారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు వేలన్ మాట్లాడుతూ జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులకు, ప్రభుత్వ పాఠశాలల్లోని ఆయమ్మలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ నాయకులు వేణి, వనిత, సూర్య ప్రభ, విజిత, సరస్వతి, ఆదిలక్ష్మి, సరసు, కుప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరులు ప్రపంచశాంతికి పాటు పడాలి



టేకుమంద జెడ్పీ హైస్కూల్‌లో నో వార్ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

బంగారుపాళెం: ప్రపంచ శాంతిని నెలకొల్పేందుకు విద్యార్థులు పాటు పడాలని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ హెచ్ఎం వేణురెడ్డి అన్నారు. మండలంలోని టేకుమంద జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం హిరోషిమా డేని ఏపీజే అబ్దుల్ కలాం సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా ఆగస్టు 6వ తేదీ జపాన్ నగరంలోని హిరోషిమా పట్టణంపై బాంబర్ బీ–29 ప్రయోగించిందన్నారు. దీన్ని లిటిల్‌బాయ్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. అణుబాంబు సృష్టించిన విధ్వంసం మరిచిపోని దుర్ఘటన అని అన్నారు. ఆనాడు జరిగిన అపార ప్రాణ నష్టానికి గుర్తుగా ‘‘హిరోషిమా పీస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హిరోషిమా డే నిర్వహిస్తూ ప్రపంచ శాంతికి పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. సైన్స్ క్లబ్ ప్రతినిధులు షంషీర్‌ఖాన్, విజయకుమారి మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం మానవాళి అభివృద్ధికి దోహదపడాలే కాని వినాశకరం కాకూడదన్నారు. శాస్త్ర పరిజ్ఞానం దుర్వినియోగం అవడానికి హిరోషిమా, నాగసాకి దుర్ఘటనలు సాక్ష్యాలని తెలిపారు. అనంతరం ‘‘నో వార్’’ అక్షర ఆకారంలో విద్యార్థులు కూర్చుని ‘యుద్ధం వద్దు–ప్రపంచ శాంతి ముద్దు’’ అంటూ నినదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషప్పలు, దేవకి, వెంకటస్వామి, జయప్రకాష్, వెంకటరమణ, అన్నపూర్ణదేవి, శుభలక్ష్మి, సైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు


సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు

నగరి: చింతలపట్టెడ ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న తిరునాళ్లలో భాగంగా మంగళవారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు డాక్టర్ నటరాజన్ కుటుంబసభ్యులు కల్యాణోత్సవానికి ఉభయదారుగా వ్యవహరించారు. ఇంటి వద్ద నుంచి సాంప్రదాయబద్ధంగా సారెను తీసుకువచ్చి వేదమంత్రోచ్చారణ నడుమ అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలు, విద్యుత్ దీపాలు, అరటి చెట్లతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ద్రౌపతి సమేత ధర్మరాజ స్వాములను సారెగా తెచ్చిన పట్టువస్త్రాలతో, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. పురోహితులు ప్రసాద్‌గుర్క కల్యాణోత్సవ వేడుకలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవ వేడుకలను తిలకించారు. ఉభయదారులు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

స్త్రీనిధికి మహిళలే యజమానులు


మాట్లాడుతున్న ఏపీఎం

పాలసముద్రం: ప్రభుత్వం మహిళలకు సత్వర రుణాలను అందిస్తూ రాభాల బాట లో నడుస్తున్న ఏకైక సహకార సంస్థ స్త్రీనిధి అని ఐకేపీ ఏపీఎం వరదప్రసాద్ అన్నారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల లీడర్లు, సంఘమిత్ర, వీఓ లీడర్, సీసీ లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఏపీ ఎం మాట్లాడుతూ ప్రభుత్వం మరిన్ని ఎక్కువ రుణాలు అందించేలా స్త్రీనిధి సంస్థను మెరుగుపరిచే బాధ్యత మహిళలపై ఉందన్నారు. మహిళా ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన స్త్రీనిధి సంస్థకు పూర్తిస్థాయి యజమానులు మహిళలేనని తెలిపారు. బ్యాంకు లింకేజీల ద్వారా అందుతున్న వడ్డీలేని రుణాలను సంఘసభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. సీసీ చిరంజీవి, సంఘమిత్ర, శోభ, మంజుల, మురగయ్య, బాలయ్య, మంజుల పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్: ఉన్నత చదువు చదివే విద్యార్థుల్లో పోటీతత్వం ముఖ్యమని కొటిల్య బ్యాంక్ కోచింగ్ నిర్వాహకులు ఎస్.ఎస్.రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పర్సనల్ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివిధ పోటీపరీక్షల్లో రాణించాలంటే పోటీతత్వం కల్పించాలన్నారు. నిరంతర విశ్లేషణాత్మక అధ్యయనం చాలా ముఖ్యమని చెప్పారు. తద్వారా ఎలాంటి ఉద్యోగమైనా సులువుగా సాధించవచ్చని తెలిపారు. ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు చెడువ్యసనాలకు లోను కాకూడదని తెలిపారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్తే భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధిస్తారన్నారు. ఆత్మవిశ్వాసం, విషయజ్ఞానం ఉన్నంత వరకు అపజయమంటూ ఉండదని తెలిపారు. ఓటమికి కుంగిపోకూడదని, ప్రయత్నం చేస్తూ ఉంటే ఫలితం కచ్చితంగా ఉంటుందన్నారు. అనంతరం బ్యాంక్ కోచింగ్ నిర్వాహకులు ఎస్ఎస్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్, జేకేసీ సమన్వయకర్త బాబు, అధ్యాపకులు శరవణ, సుభాషిణి, బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శ్రీద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- అమ్మవారికి స్నపనోత్సవాలతో పాలాభిషేకం
- పురవీధుల్లో దర్శనమివ్వనున్న గణనాథుడు


ద్రౌపదీదేవి ఆలయం

పుత్తూరు: శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, వాస్తు శాంతి, కలశ స్థాపన అనంతరం అంకురార్పణ నిర్వహించనున్నారు. 9 గంటలకు మహిళలు కలశాలతో పాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకు వస్తారు. మహిళలు తమ స్వహస్తాలతో అమ్మవారికి పాలాభిషేకం చేయనున్నారు. అనంతరం శ్రీద్రౌపదీ దేవీ సమేత శ్రీధర్మరాజుల స్వామివార్లకు పట్టువస్త్రాలతో విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు ఉభయ అదరాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగవతారిణి పి.సద్గురత హరికథా గానం ఉంటుంది. రాత్రి 7 గంటలకు విఘ్నేశ్వరస్వామిని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి, మంగళ వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల సందడి నడుమ పురవీధుల్లో ఊరేగింపు చేపట్టనున్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

8వ తేదీన గురువారం ఉదయం స్వామి అమ్మవార్లకు పుష్పాలంకరణ. శ్రీద్రౌపదీదేవి జనన స్థలమైన పొటూరు, పరిసర గ్రామాల భక్తుల నుండి పసుపు, కుంకుమ, చీర, సారెను ఊరేగింపుగా తీసుకొనివస్తారు. సాయంత్రం కామధేనువు వాహనంపై శ్రీకృష్ణ, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఊరేగింపు.

9వ తేదీన ధ్వజారోహణం: ఉదయం 6 గంటలకు గోపూజ, శ్రీకృష్ణ భగవానునికి భక్తులతో పాలాభిషేకం, సాయంత్రం 6 గంటలకు సుమంగళీవ్రతం, కుంకుమార్చన, జ్యోతిపూజ, రాత్రి 9 గంటలకు ధ్వజారోహణం.

16వ తేదీన అర్జున తపస్సు: ఉదయం 6 గంటలకు నంది సేవ, ఆది దంపతులైన శ్రీపార్వతీ పరమేశ్వరులు నంది వాహనారూఢులై విచ్చేసి అర్జునునికి పాశుపతాస్త్రం ప్రసాదించుట, 9 గంటలకు అర్జున వేషధారి తపస్సుమానుపై ఆధిరోహించే ఘట్టం. రాత్రి 8 గంటలకు ద్రౌపదీ స్పెషల్ వద్ద పాటకచ్చేరి. రాత్రి 9 గంటలకు వరలక్ష్మీ దేవి అలంకారంలో ద్రౌపదీదేవి దర్శనం. రాత్రి 11 గంటలకు మంటిగ్లో గుంట నుంచి ‘‘ఏలుబుగారి’’ ఉత్సవం ఊరేగింపుగా వచ్చి ఆలయంలో ప్రతిష్ఠ. రాత్రి 1 గంటకు కాళికాదేవికి బలిదానమిచ్చి బలి ఇచ్చే కార్యక్రమం ఉంటుంది.

17వ తేదీన రథోత్సవం: ఉదయం 6 గంటలకు గరుడసేవ ఉత్సవం, శ్రీకృష్ణరాయబారం. మధ్యాహ్నం 3 గంటలకు దుశ్శాసన, దుర్యోధన వధ, పాండవ విజయం. సాయంత్రం 4 గంటలకు మహారథోత్సవం.

18వ తేదీన అగ్నిగుండ ప్రవేశం: ఉదయం 8 గంటలకు కల్యాణ్యవ్రత మహానం, సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం. రాత్రి 8 గంటలకు కుంభాగ్రహం నుండి అలంకరణ పరిగ్రహించుట. 9 గంటలకు సూర్య ప్రభోత్సవం ఉంటాయి.

19వ తేదీన ధ్వజావరోహణం: ఉదయం 7 గంటలకు అగ్నిగుండం శాంతి పూజ, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి వసంతోత్సవం. రాత్రి 9 గంటలకు ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

నగరి: తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం కేవీకే మైదానంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తల్లిపాల వారోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను తల్లులు తెలుసుకోవాలని కోరారు. ఆర్డీఓ వెంకటరెడ్డి మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడంతో తల్లులకు ఉన్న ఆపోహలను విడిచిపెట్టాలన్నారు. యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎయిల్ అరసన్ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డలకు చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవిశిమార్, ఎంపీడీఓ సతీష్, సీడీపీఓ కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానంతరం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బ్యాగ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.